క్లుప్తంగా

కలెక్టర్‌ను కలిసిన కె.కె.రాజు



కలెక్టర్ మల్లికార్జునకు వినతిపత్రం అందిస్తున్న నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు

సీతమ్మధార: కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జునను కలెక్టరేట్‌లో గురువారం నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు కలిశారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన వినతులు, అభివృద్ధి పనులకు సంబంధించిన ఆయనకు వినతి పత్రం అందించారు. అనంతరం కొద్దిసేపు చర్చించారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగంగా జరిగేలా చూడాలని కలెక్టర్‌ను కె.కె.రాజు కోరారు.

ఘనంగా సుబ్రహ్మణ్యస్వామి ఆడికృత్తిక ఉత్సవం



స్వామికి పూజలు చేస్తున్న భక్తులు

కంచరపాలెం: ఆషాఢ మాస బహుళ ఏకాదశి సందర్భంగా సుబ్రహ్మణ్య స్వామి ఆడికృత్తిక మహోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఊర్వశి జంక్షన్ రవీంద్రనగర్‌లోని సుబ్రహ్మణ్య స్వామి ఏకాంత ఆలయంలో శరవణ ట్రస్ట్ చైర్మన్, ఆలయ ధర్మకర్త దేవాల రాజుకృష్ణ ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకుడు రామకృష్ణ శర్మ స్వామికి క్షీర, పంచామృతాభిషేకాలు, అష్టోత్తర శత కలశాభిషేకం, సహస్ర నామ విభూది పుష్పాలతో అర్చనలు, సర్పదోష, కాల సర్ప, కుజ, రాహు, కేతు, దోష నివారణకు పూజలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం జరిపారు. సాయంత్రం దీపారాధన చేసి సుబ్రహ్మణ్య స్వామిని పల్లకీలో ఊరేగించారు.

అన్నదమ్ముల మధ్య తగాదా

తమ్ముడికి గాయాలు

మద్దిపాలెం: ఇద్దరు అన్నదమ్ముల మధ్య వివాదంలో తమ్ముడు గాయపడ్డాడు. కంచరపాలెం ఐదో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలిలా.. కప్పరాడలో అన్నదమ్ములు సోమేష్, నాగరాజు తల్లితో కలిసి నివసిస్తున్నారు. వీరిద్దరికి మద్యం తాగే అలవాటు ఉంది. ఈ క్రమంలోనే బుధవారం రాత్రి మద్యం తాగి ఇంటికి వచ్చిన తర్వాత ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. తల్లి ఇద్దరినీ మందలించడంతో ఆ సమయానికి వారు నిద్రపోయారు. గురువారం ఉదయం 11.30 గంటల సమయంలో ఇద్దరూ కలిసి సమీప దుర్గానగర్‌లోని ఓ బార్‌కు వెళ్లి మద్యం తాగి ఇంటికొచ్చారు. రాత్రి జరిగిన గొడవను తవ్వుకున్నారు. మద్యం మత్తులో ఉన్న అన్నయ్య సోమేష్.. తన తమ్ముడు నాగరాజు తలపై గ్రైండర్‌తో కొట్టి గాయపరిచాడు. నాగరాజు కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. అతడి ఫిర్యాదు మేరకు సీఐ ఎస్.విజయ్‌కుమార్ నేతృత్వంలో హెడ్ కానిస్టేబుల్ రమేష్‌రెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డెక్కిన మురుగు నీరు



బాలయ్యశాస్త్రి లేఅవుట్ రోడ్డులో మ్యాన్‌హోల్ లీకై ప్రవహిస్తున్న మురుగు నీరు

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డు బాలయ్యశాస్త్రి లేఅవుట్ రహదారిలో యూజీడీ మ్యాన్‌హోల్స్ తరచూ లీకవుతున్నాయి. వాటి నుంచి మురుగు నీరు రోడ్డెక్కి ప్రవహిస్తోంది. రాకపోకల సమయంలో వాహన చోదకులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. మురుగు నీటి దుర్వాసనతో ముక్కు మూసుకుని రాకపోకలు సాగించాల్సి వస్తోందని స్థానికులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి లీకవుతున్న మ్యాన్‌హోల్స్‌కు మరమ్మతులు చేపట్టాలని వారు కోరుతున్నారు.

వలంటీర్ల సేవలకు సలాం

- పథకాల పంపిణీలో నిబద్ధత
- హర్షం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు

తాటిచెట్లపాలెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థ దేశంలోనే అత్యుత్తమమని ఇతర రాష్ట్రాలు సైతం కొనియాడుతున్నాయి. ఇతర రాష్ట్రాలు, దేశాలు ఈ వ్యవస్థను తమ ప్రాంతాల్లో కూడా పరిచయం చేసేందుకు పలు అధ్యయనాలు కూడా చేశాయి. అటువంటి వలంటీర్ వ్యవస్థ మీద, వలంటీర్ల మీద జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ చేసిన ఆరోపణలు, అనుచిత వ్యాఖ్యలు తీవ్రమైనవని ప్రతి ఒక్కరూ ఖండిస్తున్నారు. గాంధీజీ కలలు గన్న గ్రామ స్వరాజ్యం దిశగా రాష్ట్రాన్ని ముందుకు నడిపేందుకు సీఎం వైఎస్ జగన్ తీసుకున్న ఈ గొప్ప నిర్ణయం వల్ల ప్రజలందరూ ఏదో సమయంలో ఏదో రూపంలో వలంటీర్ల నుంచి సేవలందుకున్నవారే. ఈ వ్యవస్థ ద్వారా ఇంటి వద్దకే రేషన్, పింఛన్, ప్రభుత్వ సేవలు అందించిన ఘనత ఈ ప్రభుత్వానిదే. ప్రపంచాన్నే వణికించిన కరోనా లాక్‌డౌన్ సమయంలో తమ ప్రాణాలకు తెగించి వలంటీర్లు ఎప్పటికప్పుడు లబ్ధిదారులకు అవసరమైన నిత్యావసర సరకులు, మందులు, ఆర్థిక సాయాలు అందజేసి శభాష్ అనిపించుకున్నారు.

ప్రజా సేవే పరమావధి..

ప్రజా సేవే పరమావధిగా భావించి వార్డు వలంటీర్లు విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సేవలను లబ్ధిదారులకు నేరుగా అందజేస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు. ముఖ్యంగా వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీలో నిబద్ధతను కనబరుస్తున్నారు. ప్రతి నెలా ఒకటో తేదీ రాగానే సూర్యుడు ఉదయించక ముందే లబ్ధిదారుల తలుపు తట్టి పెన్షన్ సొమ్ము వారి చేతుల్లో పెడుతున్నారు. పింఛన్‌దారులంతా సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఆ సమయంలో లబ్ధిదారులెవరైనా ఇంటి వద్ద లేకుంటే.. ఎక్కడున్నారో కనుక్కుని సుదూర ప్రాంతాలకు సైతం సొంత ఖర్చులతో వలంటీర్లు వెళ్లి పింఛన్ సొమ్ము అందజేస్తున్నారు. ఎటువంటి నిర్లక్ష్యానికి.. ఆలస్యానికి తావు లేకుండా సేవాదృక్పథంతో పనిచేస్తున్నారు. ఇలా అనేక కార్యక్రమాలతో ప్రజలందరికీ తమ విలువైన సేవలు అందజేస్తున్నారు. వలంటీర్ల పనితీరుపై లబ్ధిదారులంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

45వ వార్డులో.. లబ్ధిదారుల సేవలో...

జీవీఎంసీ 45వ వార్డులో వలంటీర్లు ప్రజలతో మమేకమై వారి సమస్యలు తెలుసుకుని అండగా నిలుస్తున్నారు. పారదర్శకంగా అర్హులైన లబ్ధిదారులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సేవలు అందించడంలో విశేష కృషి చేస్తున్నారు.

పింఛన్ కష్టాలు తొలిగాయి

గతంలో పింఛన్ తీసుకునేందుకు ఎన్నో కష్టాలు పడేవాడిని. వలంటీర్-సచివాలయ వ్యవస్థ వచ్చిన తరువాత అవి తీరిపోయాయి. మా వలంటీర్ ఎ.రాజు ప్రతి నెలా ఇంటికి వచ్చి మాకు పింఛన్ ఇచ్చి వెళ్తున్నాడు. ఎప్పటికప్పుడు మా కష్టాలు, సమస్యలు తెలుసుకుంటూ ఎంతో సహాయం చేస్తున్నాడు. అటువంటి వలంటీర్లపై కొంతమంది నాయకులు నోరు పారేసుకోవడం దారుణం.

– నీలాపు హరికృష్ణ, వాసుదేవనగర్, 45వ వార్డు



నీలాపు హరికృష్ణకు పింఛన్ అందిస్తున్న 256 సచివాలయం వలంటీర్ ఎ.రాజు(ఫైల్)



బొందల అప్పలనర్సమ్మ, అప్పయ్యమ్మలకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ అనిత(ఫైల్)

వలంటీర్ వ్యవస్థ బాగుంది

మా అమ్మ వృద్ధాప్య, నేను వితంతు పింఛన్లు తీసుకుంటున్నాం. గతంలో పెన్షన్ కోసం కదల్లేని స్థితిలో ఉన్న మా అమ్మను తీసుకుని వెళ్లి వేకువజాము నుంచి లైన్‌లో వేచి చూసేవాళ్లం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన వలంటీర్లతో మా కష్టాలు తీరాయి. ఎక్కడికీ వెళ్లే పని లేకుండా, రూపాయి ఖర్చు లేకుండా మా వలంటీర్ మొగిలి అనిత పింఛన్ సొమ్ము తెచ్చి చేతికందిస్తోంది. వలంటీర్ వ్యవస్థను ప్రవేశపెట్టిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు చేతులెత్తి నమస్కరిస్తున్నాం.

– బొందల అప్పలనర్సమ్మ, సంతోషిమాత కాలనీ

మా వలంటీర్ సాయంతోనే పెన్షన్ పొందా

వలంటీర్లకు వందనం

నా వృద్ధాప్య పింఛన్‌కు అవసరమైన అన్ని సర్టిఫికెట్లు మా వలంటీర్ ధనలక్ష్మి తానే స్వయంగా చేయించి నాకు పింఛన్ మంజూరయ్యేలా చేసింది. తొలిసారిగా ఈ ప్రభుత్వంలో నేను పింఛన్ అందుకుంటున్నాను. పెన్షన్ కోసం ఎక్కడికెళ్లాలో.. ఏం చేయాలో తెలియని స్థితిలో మా వలంటీర్ అన్ని పనులు చేయించింది. ఇప్పుడు ప్రతి నెలా ఒకటే తేదీనే పింఛన్ సొమ్ము మా ఇంటి తలుపు తట్టి నా చేతుల్లో పెడుతోంది.

– గెద్దం జామమ్మ, ఏఎస్సార్ నగర్



గెద్దం జామమ్మకు తొలి పింఛన్ ఇస్తున్న 255 సచివాలయం వలంటీర్ ధనలక్ష్మి(ఫైల్)

సంక్షేమ బోర్డు సాధనకు సమష్టి పోరాటం



కార్యక్రమానికి హాజరైన ఆటో డ్రైవర్లు



ఆటో డ్రైవర్ల జిల్లా సదస్సులో మాట్లాడుతున్న కె.కె.రాజు

సీతంపేట: సంక్షేమ బోర్డు సాధనకు ఆటో డ్రైవర్లంతా సమష్టిగా పోరాడాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ పిలుపునిచ్చారు. ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామనమూర్తి అధ్యక్షతన ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో గురువారం ఆటో డ్రైవర్ల జిల్లా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు మాట్లాడుతూ ఆటో డ్రైవర్ల సంక్షేమానికి వాహన మిత్ర పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. ఆటో డ్రైవర్ల కుటుంబాలకు అన్ని రకాల ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తిస్తాయని చెప్పారు. మెరిట్ సాధించిన ఆటో డ్రైవర్ల పిల్లలకు ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో సీట్లు కేటాయించేలా చూస్తామన్నారు. రూ.1,000 నుంచి రూ.5 లక్షల వరకు ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత వైద్య సేవలు పొందవచ్చని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సభాధ్యక్షుడు వామనమూర్తి మాట్లాడుతూ ఆటో డ్రైవర్లపై ఉన్న పెండింగ్ ఈ చలానాలు రద్దు చేయాలని, పీఎఫ్, ఈఎస్ఐతో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, 21, 31 నంబర్ల జీవోలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్లకు జగనన్న ఇళ్లు మంజూరు చేయాలని, పార్కింగ్ స్థలాలు కేటాయించాలని కోరారు. మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎం.బుచ్చిరాజు, ట్రాఫిక్ ఏసీపీలు జాన్‌మనోహర్, జి.రాజీవ్‌కుమార్, సీఐ ప్రసాద్‌లు మాట్లాడుతూ నియమ నిబంధనలు పాటిస్తే ఆటో డ్రైవర్లకు జరిమానాలు ఉండవన్నారు. వారి సమస్యల పరిష్కారానికి తమ వంతు సాయం అందిస్తామన్నారు. రవికృష్ణ, ఎస్.మధు, రెడ్డి శివ, వై.వెంకట్, శ్రీనివాసు, ఎం.ఎ.ఖాన్, లక్ష్మణ్, శివాజీ, నాగరాజు, అప్పలరాజు, అధిక సంఖ్యలో ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'తో సత్వర సేవలు



మాట్లాడుతున్న కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్

మద్దిపాలెం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అర్హులైన ప్రజలందరికీ సత్వరమే మరిన్ని సేవలు అందుబాటులోకి వస్తున్నాయని 50వ వార్డు కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్ పేర్కొన్నారు. వార్డులోని వుడా కాలనీ, వుడా కాలనీ-2 సచివాలయంలో గురువారం జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి సక్రమంగా అందేలా చూడటమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. జగనన్న సురక్ష క్యాంప్‌లో కుల, ఆదాయ, కుటుంబ సభ్యత్వ తదితర ధ్రువపత్రాలను అందజేస్తున్నారని తెలిపారు. హౌస్‌హోల్డ్ మ్యాపింగ్, ఆధార్‌తో మొబైల్ అనుసంధానం చేస్తున్నారన్నారు. ఈ నెల 17 నుంచి 24 వరకు జరిగే సురక్ష కార్యక్రమంలో కొత్త రైస్ కార్డులు, వాటిలో మార్పులు చేర్పులు చేస్తారని చెప్పారు. ప్రజలకు ఈ సేవలు పూర్తి బాధ్యతతో అందించాలని సచివాలయ సిబ్బంది, వలంటీర్లను కార్పొరేటర్ కోరారు. కార్యక్రమంలో 293, 294 సచివాలయం కన్వీనర్లు, కార్యదర్శులు, వలంటీర్లు పాల్గొన్నారు.

స్మార్ట్ బస్ బే పరిశీలన

సీతంపేట: నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు సూచనల మేరకు జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్, 25వ వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ గురుద్వారా జంక్షన్ వద్ద రూ.36 లక్షలతో కొత్తగా నిర్మించిన బస్ బేను గురువారం ఉదయం అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎగ్జిక్యూటివ్ క్యాపిటల్‌గా పేరొందిన విశాఖను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆ స్థాయిలో అభివృద్ధి చేస్తున్నారని, స్మార్ట్ సిటీకి తగ్గట్టు బస్ షెల్టర్లను కూడా ఆధునికంగా తీర్చిదిద్దారన్నారు. త్వరలో ప్రముఖుల చేతుల మీదుగా బస్ బే ప్రారంభించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జీవీఎంసీ ఏఈ శ్రీరామమూర్తి, వార్డు ప్లానింగ్ సెక్రటరీ వెంకటరమణ, ఎమినిటీస్ సెక్రటరీ రామకృష్ణ, వార్డు యూత్ అధ్యక్షుడు సన్నీ, ఉప్పిలి అప్పన్న, భోగవిల్లి కొండలరావు, గుడివాడ గౌరినాయుడు తదితరులు పాల్గొన్నారు.



గురుద్వారా జంక్షన్ బస్ బేను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు కృషి

కంచరపాలెం: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలు పాటించి ప్రమాదాలను నియంత్రించాలని జిల్లా ఎన్జీవోస్ ఫోరం అధ్యక్షురాలు డాక్టర్ శశిప్రభ పిలుపునిచ్చారు. సీఫా ఎన్జీవో, ఎస్‌బీసీసీ సంస్థలు సంయుక్తంగా గురువారం కప్పరాడ జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో పర్యావరణ పరిరక్షణ, రహదారి భద్రత, ఎకో వైజాగ్ అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పూర్తిస్థాయిలో కృషి చేయాలన్నారు. ఎకో వైజాగ్‌ను విజయవంతం చేయడానికి ప్రతి విద్యార్థి కృషి చేయాలని కోరారు. ప్రతి ఒక్కరూ పర్యావరణహితంగా జీవించాలని, ఒక్కసారి వాడి వదిలేసే ప్లాస్టిక్‌ను వినియోగించవద్దని సూచించారు. మరో అతిథి కంచరపాలెం పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ ఆదిరాజు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తమ తల్లిదండ్రులు, అన్నదమ్ములకు ట్రాఫిక్ నిబంధనలను వివరించి అవి పాటించేలా చూడాలన్నారు. ద్విచక్ర వాహనం నడిపేటప్పుడు హెల్మెట్ ధరించాలని చోదకులకు ప్రతి రోజు అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల హెచ్ఎం విజయమాలిని, సచివాలయ సిబ్బంది శ్రీలక్ష్మి, రమణి, తరంగిణి తదితరులు పాల్గొన్నారు.



ఎకో వైజాగ్ ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థులతో డాక్టర్ శశిప్రభ

యువతి అదృశ్యం

మద్దిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ యువతి అదృశ్యమైన ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. ఎం.నవ్య అనే యువతి తల్లిదండ్రులతో కలిసి కైలాసపురంలో నివసిస్తోంది. ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని ఓ స్వీట్ షాపులో పనిచేస్తోంది. ఈ నెల 5న ఉదయం 10 గంటలకు షాపునకు బయలుదేరి వెళ్లి తిరిగి రాత్రి 10 గంటలైనా ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు అంతటా వెతికారు. ప్రయోజనం లేకపోవడంతో తండ్రి ఎం.అప్పన్నబాబు గురువారం కంచరపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ ఎస్.విజయ్‌కుమార్ నేతృత్వంలో ఉమెన్ హెడ్ కానిస్టేబుల్ కృష్ణకుమారి కేసు దర్యాప్తు చేపట్టారు.

అప్పన్నకు ఆర్జిత సేవలు

సింహాచలం: ఏకాదశి సందర్భంగా శ్రీవరాహ లక్ష్మీ నృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు ఘనంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణతులసీ దళార్చనను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

వేడుకగా అమ్మవారి పండగ

మద్దిపాలెం: జీవీఎంసీ 51వ వార్డు మాధవధారలో కొలువైన కనకమహాలక్ష్మి అమ్మవారి పండగ గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త ససపల కీర్తి ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కనకమహాలక్ష్మిని దర్శించుకున్న 51వ వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ, 50వ వార్డు కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్ వార్డు ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని పూజలు చేశారు. భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

వనితా వాకర్స్ సేవలు ఆదర్శం



వాకర్స్ క్లబ్ సభ్యురాలిని సత్కరిస్తున్న డిస్ట్రిక్ట్-101 గవర్నర్ ఉప్పలపాటి శుభ

మురళీనగర్: వనితా వాకర్స్ క్లబ్ మహిళలు నిర్వహిస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలు ఆదర్శంగా నిలుస్తున్నాయని వాకర్స్ డిస్ట్రిక్ట్-101 గవర్నర్ ఉప్పలపాటి శుభ అన్నారు. మురళీనగర్‌లోని ఒక ఫంక్షన్ హాల్‌లో గురువారం నిర్వహించిన క్లబ్ 21వ వార్షికోత్సవంలో ముఖ్య అతిథిగా ఆమె ప్రసంగించారు. సామాన్య సభ్యులుగా చేరిన ఎందరో మహిళలు వాకర్స్ ఇంటర్నేషనల్ స్థాయిలో నాయకులుగా ఎదిగిన విషయాన్ని గుర్తు చేశారు. నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవడానికి వనితా వాకర్స్ క్లబ్ ఒక గొప్ప వేదికగా పేర్కొన్నారు. మహిళలు సమైక్యంగా ఉంటూ సమన్వయంతో పనిచేయడం వల్లే క్లబ్‌కు అంతర్జాతీయ స్థాయిలో అనేక అవార్డులు లభించాయని చెప్పారు. ఈ సందర్భంగా క్లబ్ మహిళలు ఉత్సవాలు ఆటపాటలతో సందడిగా నిర్వహించారు. పాడుతా తీయగా ఫేమ్ మావూరి శ్రావణి ఆలపించిన సినీ గీతాలు సభికులను అలరించాయి. డాక్‌యార్డ్ ఉద్యోగి శ్యాంబాబు మగ, ఆడ గొంతుకలతో పాడిన పాటలు మంత్రముగ్ధులను చేశాయి. శిరీష లత, భానుమతి, సురేంద్రకౌర్‌లకు ఉప్పలపాటి శుభ చేతుల మీదుగా ఉత్తమ సేవా అవార్డులు అందించారు. కార్యక్రమంలో వనితా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు వి.ప్రభాశర్మ, కార్యదర్శి ఎస్.రోజారాణి, ఉపాధ్యక్షులు ప్రభావతి, వినీల, ఆర్‌సీ-5 లక్ష్మీరెడ్డి, పూర్వ అధ్యక్షులు ఉమాదేవి, కె.మాధవి, కోశాధికారి షీలారాణి, ఓం వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు వి.ప్రమీల, దుర్గాప్రసన్న, వైశాఖి స్పోర్ట్స్ పార్కు అధ్యక్షుడు ఎస్.వరప్రసాద్, సుమారు 300 మందికి పైగా సభ్యులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

మురళీనగర్: మద్దిపాలెం సెక్షన్ పరిధిలోని 104 ఏరియా, బాపూజీనగర్ 11 కేవీ ఫీడర్ల నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ జోన్-2 ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఐటీఐ జంక్షన్, సిద్ధార్థనగర్, 104 ఏరియా, శ్యామ్ నగర్ కాలనీ, బాపూజీనగర్, భవానీ గార్డెన్స్, గణేష్‌నగర్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2.00 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

ఎస్ఎస్‌టీఎల్ సెక్షన్‌లో..

మద్దిపాలెం: జోన్-2 ఎస్ఎస్‌టీఎల్ సెక్షన్ పరిధిలో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ బి.కె.నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు 11కేవీ సీతన్న గార్డెన్స్, తెన్నేటి నగర్ ఫీడర్ల నిర్వహణ ప్రక్రియలో భాగంగా సీతన్న గార్డెన్స్‌లోని ఎంఎస్ఆర్ పార్కు రోడ్డు, సాయిరాం పార్లర్ జంక్షన్ నుంచి వాటర్ ట్యాంక్ రోడ్డు, తెన్నేటి నగర్‌లోని కనకదుర్గ ఫంక్షన్ హాల్ జంక్షన్, మాధవధార, గాయత్రి విద్యా మందిర్ రోడ్డు, జనతా గ్యారేజ్ జంక్షన్, గ్యాస్ గొడౌన్ జంక్షన్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

నక్కవానిపాలెం ఫీడర్‌లో..

సీతమ్మధార: జోన్-1 డివిజన్ పరిధి 11 కేవీ నక్కవానిపాలెం ఫీడర్‌లో మరమ్మతులు, చెట్టు కొమ్మల ట్రిమ్మింగ్ నిమిత్తం శుక్రవారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ ,జి.సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు నక్కవానిపాలెం, సత్యం జంక్షన్, క్రాంతినగర్, కాకతీయ ఫంక్షన్ హాల్, 60 అడుగుల రోడ్డు, శారద స్కూల్ ప్రాంతం, సీ టవర్స్ అపార్ట్‌మెంట్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

బహిరంగ వేలం వాయిదా

దాబాగార్డెన్స్: జీవీఎంసీ 5వ జోన్ పరిధి జ్ఞానాపురం కార్యాలయంలో ఈ నెల 14న కాన్వెంట్ జంక్షన్ వద్ద గల ఐవోసీఎల్ పెట్రోల్ బంక్ స్థలం వేలం నిర్వహించాల్సి ఉండగా, అనివార్య కారణాల వల్ల వాయిదా వేసినట్లు జోనల్ కమిషనర్ ఆర్జీవీ కృష్ణ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బహిరంగ వేలం ఎప్పుడు నిర్వహించేది త్వరలో పత్రికా ప్రకటన ద్వారా తెలియజేస్తామని, పూర్తి సమాచారం కోసం జోన్-5 జోనల్ కార్యాలయ పర్యవేక్షకులను పని వేళల్లో సంప్రదించాలని తెలిపారు.

జోన్-3లో సమస్యలు లేకుండా చర్యలు

సీతమ్మధార: నగరంలోని అనధికార భవనాలతోపాటు గోడలపై పోస్టర్లు అతికించకుండా చర్యలు తీసుకోవాలని టౌన్ ప్లానింగ్ డీసీపీ నరేంద్రనాథ్ రెడ్డి ఆదేశించారు. జీవీఎంసీ కమిషనర్ ఆదేశాల మేరకు టౌన్ ప్లానింగ్ ఆధ్వర్యంలో గురువారం ఆశీలమెట్టలోని జోన్-3 కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జోన్-3 పరిధిలో సమస్యలు లేకుండా చూడాలని, రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. భవన నిర్మాణ వ్యర్థాలను రహదారులపై వేయకుండా చర్యలు చేపట్టాలని వార్డు ప్రణాళిక కార్యదర్శులకు ఆదేశించారు. కార్యక్రమంలో చీఫ్ సిటీ ప్లానర్ సునీత, ఏసీపీ శాస్త్రి సభవన్, టీపీవో తేజ, అనిత, టౌన్ ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



సూచనలిస్తున్న టౌన్ ప్లానింగ్ డీసీపీ నరేంద్రనాథ్‌రెడ్డి

వాకర్స్ ఉద్యమానికి ఊపిరి

మురళీనగర్: వాకర్స్ ఉద్యమానికి ఊపిరి పోసిన గొప్ప సేవకుడిగా జయంతిలాల్ తోష్నివాల్ చరిత్రలో నిలిచిపోయారని వాకర్స్ డిస్ట్రిక్ట్-101 గవర్నర్ ఉప్పలపాటి శుభ అన్నారు. తోష్నివాల్ 93వ జయంతిని వాకర్స్ క్లబ్ ఆవరణలో క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి అధ్యక్షతన గురువారం సాయంత్రం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వాకర్స్ క్లబ్ సమకాలీకుడిగా తోష్నివాల్ వాకర్స్ ఉద్యమాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లారని పల్లా చంద్రమౌళి అన్నారు. కార్యక్రమంలో క్లబ్ పూర్వ అధ్యక్షుడు నిమ్మగడ్డ బుచ్చయ్య, చిలకపాటి కృష్ణమూర్తి, సత్తి సునీల్‌రెడ్డి, లలితా రెడ్డి, ఓం వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు ప్రమీల, ఇతర సభ్యులు పాల్గొన్నారు.



తోష్నివాల్ చిత్రటం వద్ద నివాళులర్పిస్తున్న వాకర్స్ క్లబ్ సభ్యులు

మేడపై నుంచి పడి మహిళకు తీవ్ర గాయాలు

సీతమ్మధార: మేడపై నుంచి పడిన ఓ మహిళ తీవ్ర గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఫోర్త్ టౌన్ పోలీసులు తెలిపిన వివరాలిలా.. అక్కయ్యపాలెం లలితానగర్‌లోని గ్రూప్ హౌస్‌లో నివసిస్తున్న సూర్యచంద్ర, హారికకు 2013లో వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు. భర్త ఒక ప్రైవేట్ కంపెనీని డీలర్ షిప్‌తో నడుపుతున్నాడు. బుధవారం రాత్రి 10 గంటల సమయంలో భార్యాభర్తలిద్దరూ గొడవపడ్డారు. ఈ సమయంలో హారిక మేడపై నుంచి కింద పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు డయల్ 100కు కాల్‌చేసి సమాచారమిచ్చారు. ఫోర్త్ టౌన్ సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ వెంకటరావు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. హారిక తల్లి ఆదిలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు. భర్త సూర్యచంద్రను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. భర్త మేడపై నుంచి భార్యను తోసేశాడా.. లేక ఇంకా ఏమైనా జరిగిందా అన్న కోణంలో విచారణ చేపడుతున్నారు.

సిరులతల్లికి సహస్ర తులసీదళార్చన

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికికి గురువారం సహస్ర తులసీదళార్చన ఘనంగా నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు జరిగిన ఈ పూజలో ఆరుగురు ఉభయదాతలు, పంచామృతాభిషేక సేవ, శ్రీచక్రా నవవర్ణార్చన లక్ష్మీహోమంలో 44 మంది ఉభయదాతలు పాల్గొన్నారు. పై ప్రత్యేక పూజలో పరోక్ష పద్ధతిలో పాల్గొనే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబర్ 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 806081లో రుసుం చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ధర్మకర్తలు ధనలత, అనురాధ, సతీష్, సురేష్, సుబ్రహ్మణ్యం, సత్య రూపవాణి, మారుతీ ప్రసాద్, వెంకట రామకృష్ణ, ఆలయ ఏఈవో తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.



కనకమహాలక్ష్మి అమ్మవారి సన్నిధిలో భక్తులు

సైన్స్‌తోనే సమాజ ప్రగతి

దాబాగార్డెన్స్: సైన్స్ ద్వారానే సమాజ ప్రగతి సాధ్యమని సైన్స్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షుడు సీహెచ్ జగదీష్ పేర్కొన్నారు. నగరంలోని ఏవీఎన్ కళాశాలలో గురువారం స్టోరీ ఆఫ్ ఎవ్రీథింగ్ అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రీయ దృక్పథం, ఖగోళ శాస్త్రం, జీవ పరిణామం, భూ విజ్ఞాన శాస్త్రం, మానసిక శాస్త్రంలో పలు అంశాలపై చర్చించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సింహాద్రినాయుడు మాట్లాడుతూ పలు శాస్త్రాలపై రెండు రోజుల పాటు సెమినార్ తమ కళాశాలలో నిర్వహించడం ఆనందదాయకమన్నారు. ఈ సందర్భంగా జగదీష్‌ను సత్కరించారు.